క్లుప్తంగా

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

బల్లికురవ: బస్సు ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈఘటన శుక్రవారం రాత్రి మేదరమెట్ల–నార్కెట్‌పల్లి నామ్ రహదారిలోని మండలంలోని కొప్పరపాడు–వినుకొండ క్రాస్ రోడ్డు వద్ద జరిగింది. అందిన సమాచారం మేరకు.. మండలంలోని సూరేపల్లి గ్రామానికి చెందిన గుర్రాల సాంబశివరావు వినుకొండ వెళ్లేందుకు బస్సు ఎక్కేందుకు రోడ్డు క్రాస్ చేస్తున్నాడు. ఒంగోలు నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ ఢీకొట్టటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. సాంబశివరావును వెంటనే చికిత్సకు అద్దంకి వైద్యశాలకు, ఉన్నత చికిత్సకు ఒంగోలు వైద్యశాలకు తరలించారు. బల్లికురవ పోలీసులు సమాచారం తెలుసుకుని లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

వర్షంతో పంటల కళకళ


కొప్పరపాలెంలో కళకళలాడుతున్న పత్తి

బల్లికురవ: మండలంలో శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షంతో మెట్టపైరు జీవం పోసుకుని కళకళలాడుతున్నాయి. మండలంలో పత్తి, మిర్చి, జూట్, కూరగాయాలు, బోర్ల కింద మాగాణి, పండ్ల తోటల సాగు చేపట్టారు. రెండు నెలలుగా ఆడపాదడపా కురుస్తున్న వర్షాలకు పైర్లన్ని జీవం పోసుకుని కళకళలాడుతున్నాయి. వర్షాలకు చెట్టు పూర్తిగా తడవటంతో చీడపీడలు కూడా తొలగాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పిడుగుపాటుకు గేదె మృతి


మృతి చెందిన గేదె

జే.పంగులూరు: మండల పరిధిలోని ఆరికట్ల వారిపాలెంలో గ్రామ శివారులో శనివారం పిడుగు పాటుకు పాడి గేదె మృతి చెందింది. రైతు మాగులూరి వెంకటసుబ్బారావుకు చెందిన గేదె శనివారం సాయంత్రం పొలం నుంచి ఇంటికి తోలుకొస్తుండగా ఒక్కసారిగా ఉరుములతో కూడిన వర్షం పడింది. ఇంటికి వస్తున్న గేదెపై ఒక్కసారిగా పిడుగు పడటంతో అక్కడిక్కడే మృతి చెందింది. గేదెకు రైతు దూరంగా ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. విషయం తెలుసుకున్న వెటర్నరీ వైద్యుడు నాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించాడు. గేద విలువ రూ. 1 లక్ష వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం


మాట్లాడుతున్న న్యాయమూర్తి షేక్ నిషాద్‌నాజ్

చీరాల రూరల్: ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం చేసుకోవద్దని.. విద్యార్థులు కలిసిమెలసి చదువుకోవాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ నిషాద్‌నాజ్ అన్నారు. శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలోన్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడారు. ఉన్నత న్యాయ స్థానాల ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్ బాబు, కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్, టూటౌన్ సీఐ సోమశేఖర్, రిటైనర్ అడ్వకేట్ టి. సురేష్, పారా లీగల్ వలంటీర్లు ఎస్‌డి. మతిన్, షిలోహ్ పాల్గొన్నారు.

జిగురు అట్టలతో రసంపీల్చే పురుగులకు చెక్


జిగురు అట్టలను ఏర్పాటు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

చీరాల టౌన్: వేరుశనగ పంటలు సాగు చేసే రైతులను నష్టపరిచేలా దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.. దోమల నివారణకు జిగురు అట్టలను ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుందని చీరాల డివిజన్ ప్రకృతి వ్యవసాయ ఎంటీ భారతీ, ఆర్‌బీకే చైర్మన్ కె.రమణారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని తోటవారిపాలెం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న వేరుశనగ పంట పొలాలకు ప్రకృతి వ్యవసాయం అధికారులు సందర్శించి వేరుశనగ పంటలో పసుపు పచ్చపురుగుల వలన పంట దెబ్బతినడంతో పాటుగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. జిగురు అట్టల ఏర్పాటుకు ఎకరానికి రూ.250 మాత్రమే ఖర్చు అవుతుందని సూచించారు. అనంతరం రైతు పొలంలో జిగురు అట్టలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కవిత, శిరీష, పావని, నిర్మల, రైతులు ఉన్నారు.

ఉండ్రాలయ్యా.. ఉంటామయ్యా


మేదరమెట్లలో పూజలు చేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య


వాడరేవులో ట్రాక్టర్‌లో నుంచి గణేశుడుని నిమజ్జనానికి తీసుకొస్తున్న భక్తులు

- కొనసాగుతున్న వినాయకుడి నిమజ్జనాలు
- తీరంలో పటిష్ట బందోబస్తు

కారంచేడు: ఉండ్రాలయ్యా.. ఇక ఉంటామయ్యా అంటూ పూజలందుకున్న వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్నారు భక్తులు. శనివారం ఆరో రోజున కారంచేడు గ్రామంలోని మాస్కో బజారు, చినవంతెన సెంటర్, కాలువ సెంటర్, బండెలదొడ్డి, పెద బజారు సెంటర్‌లలో భక్తులు ప్రత్యేక పందిళ్ల వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

చీరాల టౌన్: చీరాల, పర్చూరు, అద్దంకి, చిలకలూరిపేట, నర్సరావుపేట, సత్తెనపల్లి తదితర నియోజకవర్గాల్లోని గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన పందిళ్లలోని గణనాథులను డీజే పాటల హోరు.. యువకుల నృత్యాలతో నిమజ్జనం కోసం వాడరేవు సముద్ర తీరానికి తీసుకువస్తున్నారు. వాడరేవులో నిమజ్జనాల సందడి నేపథ్యంలో చీరాల డీఎస్పీ ప్రసాదరావు ఆధ్వర్యంలో మెరైన్ ఏఎస్సై రాంబాబు, సివిల్, మెరైన్, ఏఆర్ పోలీసులు, గజ ఈతగాళ్లతో బందోబస్తు నిర్వహిస్తు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నారు. మేదరమెట్ల పడమటి వారిపాలెంలో వినాయకుడి పూజల్లో పాల్గొన్నారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ అంకారావు, నాయకులు పాల్గొన్నారు.

చినగంజాం: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భారీ డీజే సౌండ్స్‌తో, రంగులు చల్లుకుంటూ పల్లెపాలెం తీరంలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.


వాడరేవు తీరంలో గణపయ్యను నిమజ్జనం చేస్తున్న భక్తులు


కారంచేడులో పూజలు చేస్తున్న భక్తులు


వినాయకుడికి పూజలు చేస్తున్న యువత, మహిళలు


పల్లెపాలెం సముద్రతీరంలో నిమజ్జనం చేస్తున్న నిర్వాహకులు

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి


మంచినీటి చెరువు వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం

- ఎమ్మెల్యే కరణం

చీరాల అర్బన్: పట్టణంలో జరుగుతున్న పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. శనివారం ఆయన పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. కారంచేడు రోడ్డులోని పంప్ హౌస్‌ను, చీరాల పట్టణ పరిధిలోని ఎస్‌ఎస్ ట్యాంక్ వద్ద జరుగుతున్న పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అలానే పట్టణంలోని ముంతావారి సెంటర్, మసీదు సెంటర్‌లో జరుగుతున్న సిమెంట్ డ్రైన్స్ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనులు ఏ మేరకు పూర్తిచేశారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్లు బత్తుల అనిల్, కంపా అరుణ్, మామిడాల రాములు, గుంటూరు ప్రభాకరరావు, గోలి జగదీష్, మున్సిపల్ డీఈ ఐసయ్య, ఏఈలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అందరికీ ఆరోగ్యం

అద్దంకి: అందరికీ ఆరోగ్యం అనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని మున్సిపల్ చైర్మన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య రక్ష కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పబ్లిక్ హెల్త్ వర్కర్లు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. వారు ప్రతి రోజూ పారిశుద్ధ పనులు చేస్తేనే మనం అంతా ఆరోగ్యంగా ఉండగలుగుతున్నామన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ వర్కర్లకు మెడికల్ ఆఫీసర్ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దేశు పద్మేశ్, కే అనంత లక్ష్మి, కౌన్సిలర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, శానిటరీ ఎన్విరాన్‌మెంటల్ సెక్రటరీలు, అధికారులు పాల్గొన్నారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష..

చినగంజాం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఈ నెల 30 వ తేదీ నుంచి చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు ఎస్ విజయ భాస్కర్, పీ సాయిశ్రీచరణ్‌లు తెలిపారు. అక్టోబర్ 3వ తేదీ రాజుబంగారుపాలెం జెడ్పీ పాఠశాల, 5న మున్నంవారిపాలెం ఎంపీపీ పాఠశాల, 7న కొత్తపాలెం సచివాలయం, 10 న పల్లెపాలెం జెడ్పీ పాఠశాల, 11 న పెదగంజాం–1 జెడ్పీ పాఠశాల, 12న చినగంజాం 2 సచివాలయం, 13న పెదగంజాం–2, పాతగొల్లపాలెం ఎంపీపీ పాఠశాల, దీనికి సంబంధించి ఈనెల 26వ తేదీ రాజుబంగారుపాలెం జెడ్పీ పాఠశాలలో పైలట్ ప్రాజెక్ట్ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

హామీలు నెరవేర్చిన ఘనత జగనన్నదే


మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న కృష్ణచైతన్య

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

సంతమాగులూరు (అద్దంకి రూరల్): నవరత్నాల్లో ఇచ్చిన హామీలన్ని నెరవేర్చిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డిదేనని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. శనివారం సంతమాగులూరు మండలంలోని ఫత్తే పురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణ చైతన్య గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయాలేదని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కృష్ణచైతన్య మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చి ఒక్కటికూడా నెరవేర్చలేదని మేనిఫెస్టోను వెబ్‌సైట్‌లో నుంచి తొలగించాలన్నారు. జగనన్న మేనిఫెస్టోని భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించారన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం భవనం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ సెంటర్, కాపు కళ్యాణ మండపాన్ని ప్రారంభించారు. కొప్పరం గ్రామంలో ఏకలవ్య యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక పందిరిలో కృష్ణచైతన్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్, జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్‌ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.


సచివాలయ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణచైతన్య

యథావిధిగా అంజన్న మూలవిరాట్‌కు పూజలు

అద్దంకి రూరల్: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి ముఖమండపం నిర్మాణం చేపడుతున్నారు. స్వామివారి మూలవిరాట్‌కు జరిగే పూజలు యథావిధిగా నిర్వహిస్తున్నట్లు దేవస్థాన సహాయ కమిషనర్ టి. సుభద్ర శనివారం తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు, ఎటువంటి అపోహలు లేకుండా స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం

చీరాల అర్బన్: పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో శనివారం ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ సిహెచ్ రమణమ్మ అధ్యక్షత వహించి మాట్లాడారు. మహాత్మాగాంధీ శత జయంతి సందర్భంగా జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని జరుపుకుంటుందన్నారు. ప్రజాస్వామ్య జీవన స్ఫూర్తిని, నిస్వార్థ సేవ అవసరాన్ని చెప్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ మెంబర్ సిహెచ్ బాలభారతి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరాలు నిర్వహణ ద్వారా సమాజానికి ఉపయోగపడేలా వివిధ కార్యక్రమాలను నిర్వహించవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాతా, శిశు సంరక్షణకు అధిక ప్రాధాన్యత

చీరాల అర్బన్: మాతా, శిశు సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ కే ఉమాదేవి అన్నారు. రాష్ట్రీయ పోషక్ కార్యక్రమాల్లో భాగంగా పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం చీరాల అర్బన్ ప్రాజెక్టులోని గోలివారివీధి, కరణం వారివీధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సూరగాని లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్‌లు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంఈవో

చీరాల అర్బన్: వినియోగదారుల ఉద్యమాన్ని మరింత చైతన్యవంతం చేసేందుకు ప్రతి పాఠశాలలో వినియోగదారుల క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఈవో వుల్లెల సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. శనివారం పట్టణంలోని కస్తూరిభా గాంధీ బాలికోన్నత పాఠశాలలో వినియోగదారుల క్లబ్‌లు, వినియోగదారులను చైతన్యపరిచే తొమ్మిది రకాల పోస్టర్లు ఆవిష్కరించారు. విద్యార్థులకు వారి హక్కులు, పరిష్కార విధానాలను గురించి అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్యకరమైన వినియోగదారులుగా వ్యవహరించేలా తీర్చిదిద్దుతామన్నారు. జిల్లాలో 212 వినియోగదారుల క్లబ్‌ల ద్వారా ప్రతి నెలా సెమినార్లు, వర్క్‌షాప్‌లు, చర్చలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మహ్మద్ సాధిక్, మేలుకొలుపు కన్స్యూమర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు దాసరి ఇమ్మానియేలు, మాస్టర్ ట్రైనర్ పవని భానుచంద్రమూర్తి, ఇన్‌చార్జి హెచ్‌ఎం పి.వెంకటేశ్వరబాబు, క్లబ్ కన్వీనర్ సమాధానం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం


కొరిశపాడులో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసన్నకుమారి


సంతమాగులూరులో మాట్లాడుతున్న ఎంపీపీ


అద్దంకి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతి

సంతమాగులూరు (అద్దంకి): మండల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు ఎంపీపీ ఎనుబర్ల యల్లమంద అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ ఆధ్వర్యంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో సీహెచ్ కృష్ణ అధ్యక్షత వహించారు. దీనిలో భాగంగా శాఖల వారీగా ఆయా శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న పథకాలు, ఇంత వరకూ అందించిన పథకాల వివరాలు వెల్లడించారు. ప్రజా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అడవి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, పంచాయతీ సెక్రటరీలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి పథకం లబ్ధిదారుడికి చేరాలి..

మేదరమెట్ల: ప్రభుత్వం ద్వారా అందించే సంక్షేమ పథకం ప్రతి లబ్ధిదారుడికి చేరాలని అందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలసి పని చేయాలని ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి అన్నారు. కొరిశపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు తమ నివేదికలను సభలో వివరించారు. ఎంపీడీవో సురేష్‌బాబు మాట్లాడుతూ నెలాఖరు నుంచి మండలంలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటరమణ, తహసీల్దార్ సుశీల, పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: అన్నిశాఖలు సమన్వయంతో పని చేస్తూ మండల అభివృద్ధికి కృషిచేయాలని ఎంపీపీ అవిశెన జ్యోతి అన్నారు. శనివారం స్థానికి మండల పరిషత్ కార్యాలయంలో మండల సభ్య సమావేశం నిర్వమించారు. సమావేశానికి ఎంపీడీవో దేవసేన కుమారి అధ్యక్షతహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఖరీఫ్ పంటలు సాగుచేసిన రైతులు ఈ నెల 30వ తేదీలోపు క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. వైద్యాధికారి జయచంద్ర మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వలంటీర్లు, ఎఎన్‌యంలు, ఆశ వర్కర్లు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారన్నారు. పలు శాఖల అధికారులు మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీ సిబ్బందిపై న్యాయమూర్తి ఆగ్రహం

చీరాల రూరల్: కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల పరిసరాలను అపరిశుభ్రతపై సిబ్బందిపై న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని బుర్లవారిపాలెం పంచాయతీలోని కేజీబీవీని శనివారం మండల న్యాయ సేవాధికారసంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయంలోని బాలికలకు అందుతున్న సౌకర్యాలను గురించి న్యాయమూర్తి అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను, మరుగుదొడ్లను, రికార్డులను పరిశీలించారు. వంట గదులను పరిశీలించిన న్యాయమూర్తి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో పాటు పారిశుద్ధ్యం లోపించడంతో సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటువంటి అపరిశుభ్ర పరిసరాల్లో వంటచేసి విద్యార్థులకు వడ్డిస్తే అనారోగ్యాల బారి నపడే అవకాశం ఉందని ఆమె సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. న్యాయమూర్తి వెంట మహిళా న్యాయవాదులు జి. స్నేహ, బి. వినీల, పీఎల్వీ ఎస్డీ మతీన్, కోర్టు సిబ్బంది ఉన్నారు.

ప్రతిభామూర్తులను స్మరించుకోవాలి

అద్దంకి : వివిధ రంగాల్లో విశేషప్రతిభను కనబర్చిన ప్రతిభామూర్తులను స్మరించుకోవాల్సి ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రముఖ పద్య కవి డీవీఎం సత్యనారాయణ అన్నారు. ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగుల సంఘం అద్దంకి డిపో కమిటీ ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి సందర్భంగా శనివారం రాత్రి స్థానిక చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో గుర్రం జాషువా కళావేదికపై ప్రతిభామూర్తులు– మధుర స్మృతులు కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి సృజన ప్రధాన కార్యదర్శి అనిలకుమార సూరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మహానటి పద్మశ్రీ భానుమతి గురించి వివరించారు. ప్రకాశం రచయిత సంఘం అధ్యక్షుడు పాన్నూరి వెంకట శ్రీనివాసులు ధూర్జటి కవి గురించి ప్రసంగించారు. దీనిలో భాగంగా అద్దంకి పౌరాణిక రంగస్థల సీనియర్ నటుడు అద్దంకి ఆంజనేయరాజుకు పీఈటినర్రా గోపాలరావు నూతన వస్త్రాలు అందజేశారు. రాష్ట సాహిత్య అకాడమీ సభ్యురాలు కొల్లా భువనేశ్వరిని రోటరీక్లబ్ సెక్రటరీ చప్పిడి వీరయ్య దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమానికి ఆర్థిక సహాయాన్ని అందించిన దాతలను చెన్నుపాటి వీరాంజనేయులు షీల్డు అందజేశారు. కార్యక్రమంలో సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకరదత్తు, వీరవల్లి రుద్రయ్య, యు. దేవపాలన, ఆర్‌వీ రాఘవరావు, లెవీ ప్రసాద్, రఘురామశర్మ, రావూరి రంగయ్య, సయ్యద్ మౌలాలి, సీహెచ్ నారాయణ రావు, పీసీహెచ్ కోటయ్య, యం. హనుమంతరావు, టీఎస్‌రావు, ఆర్ ఎస్‌రావు, పాల్గొన్నారు. కార్యక్రమంలో తొలుతగా ప్రతిభామూర్తుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు స్వర్ణలో ఉచిత వైద్య శిబిరం

కారంచేడు: మండలంలోని స్వర్ణ గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణ గ్రామానికి చెందిన కేశం రామకోటేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో గ్రామంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఈ వైద్య శిబిరం నిర్వహిస్తారన్నారు. ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు ప్రారంభించే ఈ వైద్య శిబిరంలో అన్ని రకముల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారని ప్రజలు, గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.